క్లుప్తంగా

130 మందికి కంటి పరీక్షలు



కంకిపాడు: వృద్ధుల దృష్టిలోపాల నివారణకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కుందేరు ఎస్సీ కాలనీలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. శిబిరంలో 130 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



నున్న(విజయవాడరూరల్): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫిజీషియన్ డాక్టర్ విజయ సూచించారు. నున్న సచివాలయం–2 పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా బుధవారం 65 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏఎన్ఎం శ్రీలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ అధికారి సుస్మిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయా కుటుంబానికి ఆర్థిక సాయం



ఉయ్యూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఆయా కుటుంబానికి ఉయ్యూరు జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం తమ వంతు ఆర్థిక సాయం అందించారు. పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న ఎం.లక్ష్మి గృహం రెండు రోజుల క్రితం అగ్నిప్రమాదానికి గురైంది. దీంతో బాధిత కుటుంబానికి ఉపాధ్యాయులు తమ వంతు సాయంగా రూ. 20 వేలు అందించి తోడుగా నిలిచారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన కూరగాయలు అందేలా చూడాలి

కంకిపాడు: రైతుబజారులో కొనుగోలుదారులకు నాణ్యమైన కూరగాయలు అందేలా చూడాలని ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు సూచించారు. పట్టణంలోని రైతుబజారును బుధవారం ఆయన సందర్శించారు. ఎస్టేట్ అధికారి చంద్రమోహన్‌తో రైతుబజారు నిర్వహణపై సమీక్షించారు. వసంతరావు మాట్లాడుతూ అధిక ధరలకు విక్రయాలు జరగకుండా చూడాలని స్పష్టంచేశారు. మేలురకం కూరగాయలు హోల్‌సేల్ వ్యాపారులు, దుకాణదారులకు విక్రయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయన్నారు. సామాన్య కొనుగోలుదారులే లక్ష్యంగా విక్రయాలు సాగాలని సూచించారు. రైతుబజారు నిర్వహణ ఆదర్శవంతంగా సాగాలని స్పష్టం చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో బుధవారం పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగించి, సైడు డ్రెయిన్లలో పూడిక తీయించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో డ్రెయిన్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారిశుద్ధ్యంపై ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

అర్హులైన వారు దరఖాస్తు చేయండి

పెనమలూరు: ఏపీ సమగ్ర శిక్ష సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న కస్తూర్బా పాఠశాలలో పలు పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ జి. మహేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ ఎ.కొండూరు బాలికల పాఠశాలలో అసిస్టెంట్ కుక్, గంపలగూడెంలో డే వాచ్‌మెన్ పోస్టుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేయాలని కోరారు. పై రెండు పోస్టులకు 7వ తరగతి పాస్ అయ్యి ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీన సాయంత్రం 5 గంటలకు దరఖాస్తు, మార్కుల జాబితా జత చేసి విజయవాడ ఎంకే బేగ్ హైస్కూల్, విజయవాడ సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

చేరువైన వైద్యం.. ఆరోగ్యానికి ధైర్యం

- కంకిపాడు సీహెచ్‌సీలో అన్ని రకాల వైద్య సేవలు
- అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు సైతం అందుబాటులోకి..
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం భవనం

కంకిపాడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో వైద్యం అంటే ఇరుకు గదులు.. వసతులు లేని ప్రాంగణం.. అత్యవసర సేవలకు ప్రత్యామ్నాయం వెతుక్కోవటం.. స్థాయి పెరిగినా అందుకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పన జరగక రోగుల ఇబ్బందులు.. ఇది మొన్నటి వరకూ అక్కడ పరిస్థితి. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేసింది. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంది. దీంతో కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలు మెరుగయ్యాయి. వైద్యుల నియామకం జరిగింది. దీంతో ప్రజలకు సంతృప్త స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయి.

వైద్యసేవల్లో మార్పు..

గతంలో పట్టణంలోని పోలీసుస్టేషన్ రోడ్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలోనే సామాజిక ఆరోగ్యకేంద్రం నడిచేది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ అయ్యింది. స్థాయి పెంపునకు అనుగుణంగా సిబ్బంది పెంపుదల జరిగింది. అయితే వసతులు లేక వైద్యం అరకొరగా అందిన పరిస్థితి. అయితే పట్టణానికి చెందిన లయన్స్ ప్రతినిధి అక్కినేని గోపాలకృష్ణమూర్తి బైపాస్ మార్గం వెంబడి ఉన్న భూమిని సీహెచ్‌సీ నిర్మాణానికి వితరణగా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీహెచ్‌సీకి నూతన భవనం అంశాన్ని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు విడుదలకు కృషి చేశారు. దీంతో రూ 4.60 కోట్లు నిధులు విడుదల కావటంతో 30 పడకల ఆస్పత్రి భవనం అధునాతన హంగులతో రోగులకు అందుబాటులోకి వచ్చింది. దాత కుటుంబ సభ్యుల కోరిక మేరకు అక్కినేని గోపాలకృష్ణమూర్తి–సుగుణ సామాజిక ఆరోగ్యకేంద్రంగా నామకరణం చేశారు. కొద్ది నెలలుగా ఆస్పత్రి భవనంలో రోగులకు అన్ని రకాల వైద్య సేవలు సమర్థంగా అందుతున్నాయి. సీహెచ్‌సీలో జనరల్, జనరల్ సర్జరీ, అనస్తీషియా, గైనిక్, పీడియాట్రిక్, డెంటల్ వైద్య నిపుణులతో పాటుగా ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. సీహెచ్‌సీకి వైద్యులతోకలిపి ఉండాల్సిన 37 మంది సిబ్బంది విధుల్లో ఉన్నారు.



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సంజయ్

ప్రతి రోజూ 240 నుంచి 250 వరకూ ఓపీ..

వసతులు సమకూరటంతో ఒక్క పెనమలూరు నియోజకవర్గమే కాకుండా గన్నవరం, పామర్రు నియోజకవర్గాల గ్రామాల ప్రజలు కూడా వైద్య కోసం ఇక్కడికి వస్తున్నారు. ప్రతి రోజూ 240–250కి తగ్గకుండా ఓపీ సేవలు అందుతున్నాయి. వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ల్యాబ్ అందుబాటులో ఉంది. ఎక్స్‌రే సేవలు అందిస్తున్నారు. సాంకేతిక సమస్యతో తాత్కాలికంగా స్కానింగ్‌లు జరగటం లేదు.

> **ఎంతో బాధ్యతతో సేవలు..**
>
> అన్ని విభాగాలకు ప్రత్యేకంగా వార్డులు అందుబాటులోకి వచ్చాయి. సిబ్బంది కూడా అందుబాటులో ఉండి అన్ని రకాల వైద్యసేవలు సమర్థంగా అందిస్తున్నారు. హెర్నియా, పైల్స్, హైడ్రోసిల్, 24 గంటల కడుపునొప్పి శస్త్రచికిత్సలు గతంలో ఇక్కడ జరగలేదు. అవి కూడా చేస్తున్నాం. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన వైద్యం అందించటమే లక్ష్యంగా సిబ్బంది బాధ్యతతో సేవలు అందిస్తున్నారు.
>
> – డాక్టర్ సంజయ్, సూపరింటెండెంట్, కంకిపాడు సీహెచ్‌సీ

అన్ని రకాల వైద్య సేవలు..

గతంలో అత్యవసర వైద్య సేవలకు విజయవాడ, గుడివాడ ప్రాంతాలకు రోగులు వెళ్లాల్సి వచ్చేది. అలాంటిది ప్రస్తుతం రోడ్డు ప్రమాద ఘటనల్లో బాధితుల నుంచి హెర్నియా, పైల్స్, 24 గంటల కడుపునొప్పి, హైడ్రోసిల్, ఇతర మైనర్ సర్జరీస్ అన్నీ స్థానికంగానే వైద్య సిబ్బంది అందిస్తున్నారు. నెలకు సరాసరిన అన్ని రకాల సర్జరీలు 50 వరకూ చేస్తుండటం గమనార్హం. అత్యవసర సమయంలో రోగులు ఇబ్బందులు పడకుండా వైద్యం సకాలంలో అందేలా చూస్తున్నారు.

అంతటా చంద్రయాన్ సందడి

కంకిపాడు: చంద్రయాన్ విజయోత్సవ సందడి అంతటా నెలకొంది. చంద్రుడి దక్షిణ ధృవంపై విక్రమ్ రోవర్ అడుగుపెట్టిన అద్భుత సన్నివేశాన్ని టీవీలు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా వీక్షించి సంబరాలు జరుపుకున్నారు. పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో బుధవారం సాయంత్రం ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌లో చంద్రయాన్ ప్రయోగాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. చంద్రయాన్ విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు.

చంద్రయాన్–3 విజయంపై హర్షం

గన్నవరం రూరల్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో బుధవారం పలువురు హర్షం వ్యక్తం చేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి షేక్ ఇమాం, సూరంపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు కందిమళ్ల శ్రీనివాసరావు సంతోషం వ్యక్తం చేస్తూ ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

విజయోత్సాహం..

పెనమలూరు: ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్ –3 విజయవంతంగా చంద్రుడిపై ల్యాండ్ అవ్వటంతో పెనమలూరు విద్యార్థులు ఆనందోత్సాహంతో శాస్త్రవేత్తలకు అభినందనలు ప్రకటించారు. చంద్రయాన్–3 మిషన్‌లో భాగంగా చంద్రుడిపై బుధవారం ల్యాండర్ మాడ్యూల్ తుది గమ్యాన్ని విజయవంతంగా చేరుకోవటంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చంద్రయాన్ చంద్రుడిపై ల్యాండ్ అయ్యే తుది ఘట్టాన్ని విద్యార్థులు వీక్షించటానికి పాఠశాలలో ఏర్పాట్లు చేశారు. పాఠశాలలో 9,10వ తరగతి విద్యార్థులు సైన్స్ ల్యాబ్‌లో ఉన్న టీవీలో విద్యార్థులు ఆసక్తికరంగా ల్యాండర్ సురక్షితంగా చంద్రుడి పై దిగిన దృశ్యాలు చూశారు.



పునాదిపాడులో చంద్రయాన్ దృశ్యాలను వీక్షిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పెనమలూరు పాఠశాలలో చంద్రయాన్ ల్యాండింగ్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు

నివాస స్థలాలు రెగ్యులరైజ్ చేయాలని వినతి

పెనమలూరు: యనమలకుదురులో కొండ పోరంబోకులో 40 ఏళ్లుగా నివాసం ఉన్న పేదల ఇళ్లను రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. ఈ మేరకు నివాసితులు, సీపీఎం నేతలు బుధవారం పోరంకి మునిసిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ఎస్. ప్రకాశరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నివాసితులు వివరాలు తెలుపుతూ జీవో నంబర్ 310 ప్రకారం ఆర్ఎస్ నంబర్ 14లో కొండ మినహా సుమారు 34 ఎకరాలు తూర్పు, ఉత్తర దిక్కున ఉంటున్న నివాసితులకు గతంలో అధికారులు పట్టాలు ఇచ్చి రెగులరైజేషన్ చేశారన్నారు. అలాగే కొండ దిగువున ఉంటున్న పేదల ఇళ్లను కూడా రెగులరైజేషన్ చేయాలని కోరారు.

ప్రమాదంగా మారిన నివాసితుల పరిస్థితి..

కొండ పోరంబోకు స్థలంలో ఉంటున్న నివాసితుల పరిస్థితి ప్రమాదకరంగా మారిందని ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు షేక్.కాశిం తెలిపారు. కొండ అభివృద్ధి పేరుతో కొండను తవ్వటం వలన రాళ్లు, చెట్లు కొండపై నుంచి కొండ కింద నివాసం ఉంటున్న ఇళ్లపై పడుతున్నాయన్నారు.



కమిషనర్ ప్రకాశరావుకు వినతిపత్రం అందజేస్తున్న నివాసితులు, సీపీఎం నేతలు.

పలువురికి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పరామర్శ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇటీవల పెరికీడు మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహామూర్తి హఠాన్మరణం చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ బుధవారం పరామర్శించారు. మూర్తి మరణంతో వైఎస్సార్ సీపీ బలమైన నాయకుడిని కోల్పోయిందని ఎమ్మెల్యే వంశీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురై గాయపడిన స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్‌ను హనుమాన్‌జంక్షన్‌లో ఎమ్మెల్యే పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాపులపాడు మాజీ ఉప సర్పంచ్, లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు (బాబు) నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు చిరస్మరణీయం



రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు



ఉంగుటూరులో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ



టంగుటూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ పరిషత్ ప్రతినిధులు

విజయవాడరూరల్: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ.. మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చురుకైన పాత్ర పోషించారని, అనంతరం రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పని చేసి అనేక సేవలందించారని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బి.ఎల్.వి.శేషగిరిరావు, ఎంఈఓ ఎ.వెంకటరత్నం, ఏఈ శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఆంధ్ర కేసరి టంగుటూరికి ఘననివాళులు

ఉంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శేషగిరిరావు మాట్లాడుతూ.. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో టంగుటూరి తుపాకీ ఎదురు నిలిచి గుండెను చూపి ఆంధ్రకేసరి బిరుదు పొందారని గుర్తుచేశారు. ఆంధ్రా రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా తిరుపతిలో వెంకటేశ్వ విశ్వవిద్యాలయం స్థాపన, సేద్యపు నీటి ప్రాజెక్టుల నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఎంఈఓ సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో బుధవారం బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు విగ్రహానికి పరిషత్ అధ్యక్షులు పన్యారం విష్ణుమూర్తి, పలువురు సంఘ నేతలు పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు చేసిన సేవలను స్మరించుకున్నారు. సంఘ నేతలు సత్యపవన్‌కుమార్, నాగసుబ్బారావు, వెంకటశివనాగేశ్వరరావు పాల్గొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద ఎంపీపీ అనగాని రవి, పలువురు అధికారులు పుష్పాంజలి ఘటించారు.

వృద్ధుల కోసం ఓగిరాల ట్రస్ట్ ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం యువత పల్లెటూరిని వదిలి పట్నాలకు చేరుకోవటంతో గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులకు సాయం అందించేందుకు బాపులపాడు మండలం ఓగిరాలలో గ్రామస్తులు ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఓగిరాల చారిటబుల్ ట్రస్ట్ పేరుతో బుధవారం నుంచి కార్యకాలాపాలను ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఎం.వి.ఎస్. రాయుడు, కొండపావులూరు కృష్ణప్రసాద్, అలూరు వేణుగోపాల శ్రీనివాస్, మేడికొండ రామకృష్ణ, వైట్ల శ్రీను, మరి కొందరు కలిసి ఈ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులకు రోజూ సమయానికి అల్పాహారం, భోజనం, మంచినీరు, వైద్య సహాయం, మందులు సమకూర్చడం, పేద విద్యార్థుల చదువులకు ఆర్థికసాయం అందించటం, పశు సంపద, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించటం, ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దటం, నూరుశాతం అక్షరాస్యత సాధించటమే లక్ష్యంగా ఓగిరాల చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. తొలుత గ్రామానికి చెందిన పేద విద్యార్థిని గుళ్లపల్లి శ్రీనిజకు రూ.80 వేల ఆర్థికసాయం అందించారు. గ్రామంలోని వృద్ధులకు అల్పాహారం, భోజన ఏర్పాట్లు చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ట్రస్ట్‌ను ప్రారంభిస్తున్న గ్రామానికి చెందిన వృద్ధురాలు

తిరుమల నిత్యాన్నదానానికి 10 టన్నుల కూరగాయల వితరణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తిరుమలలో జరిగే నిత్యాన్నదానానికి కూరగాయలను పంపించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని దాత మండవ నాగేశ్వరరావు చెప్పారు. తిరుమల పంపే కూరగాయల లారీకి పటమట ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త కంకణాల రమేష్, మండవ వెంకటరత్నంలు లారీకి జెండా ఊపి తిరుమలకు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006వ సంవత్సరంలో విజయవాడ నుంచి తిరుమలకు కూరగాయలను పంపించడాన్ని సామాజికవేత్త మండవ కుటుంబరావు ప్రారంభించారన్నారు. ఈ ఏడాది మే 29న మండవ కుటుంబరావు ఆకస్మికంగా మరణించారని, ఆయన లేకపోయినా టీటీడీకి కూరగాయల పంపిణీ ఆగకూడదనే ఉద్దేశంతో ప్రతి నెలా కూరగాయల లారీని పంపుతున్నామని చెప్పారు. తిరుమల తిరుపతిలో జరిగే నిత్యాన్నదానికి ప్రతి నెలా విజయవాడ నుంచే కూరగాయల లారీని దాతల సహకారంతో పంపుతామని చెప్పారు. మండవ కుటుంబరావు కుటుంబసభ్యులు సస్య, అరవపల్లి ఆదిత్య, కె.శ్రీహరిరావు, ధనేకుల వెంకట సత్యనారాయణ, మండవ శ్రీనివాస్, బీఏ.నాగు పాల్గొన్నారు.



కూరగాయల లారీకి జెండా ఊపుతున్న దృశ్యం

అంపాపురంలో లోకేష్ బస

ఉంగుటూరు: టీడీపీ నేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం ఉంగుటూరు మండలంలో పెద అవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, తేలప్రోలు గ్రామాలు మీదుగా సాగింది. పీఏసీఎస్ సొసైటీ నిధుల గోల్‌మాల్ బాధితులు తమకు న్యాయం చేయాలని ఆత్కూరు ప్రధాన కూడలి వద్ద వినతి పత్రం అందజేశారు. అలాగే పొట్టిపాడులో ఎస్‌పీ పేట ప్రజలు తమ గ్రామాభివృద్ధికి సహకరించాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం బాపులపాడు మండలం సీతారామపురం–ఏ నుంచి అంపాపురం చేరుకున్న లోకేష్ అక్కడ బసచేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం రూరల్: మండలంలోని కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ గుణదల ఈఈ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం సెక్షన్ పరిధిలోని కొత్త లైను ఎరెక్షన్ వర్క్ జరుగుతున్న నేపథ్యంలో 11కేవీ పురుషోత్తపట్నం ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. గృహ, వ్యవసాయ, పరిశ్రమల వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభయాంజనేయ స్వామికి రూ.15.88 లక్షల ఆదాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానానికి రూ.15.88 లక్షల హుండీ ఆదాయం వచ్చిందని ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. దేవస్థానం కార్యాలయం ప్రాంగణంలో దేవదాయ శాఖ అధికారి సన్యాసిరావు సమక్షంలో హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. 90 రోజులకు రూ.15,88,021 ఆదాయం వచ్చింది. ఆలయ పాలకమండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది, అర్చకులు కానుకల లెక్కింపులో పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలతో పాటుగా దాతల ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వీరమాచనేని రామబ్రహ్మం సూచించారు. బాపులపాడు మండలం ఆరుగొలనులోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రతిభావంతులైన విద్యార్థులకు పూర్వ విద్యార్థి మేడికొండ బుచ్చిబాపయ్య బుధవారం నగదు బహుమతులను పంపిణీ చేశారు. వివిధ తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన 15 మంది విద్యార్థులకు రూ.18,500 నగదు బహుమతులను వీరమాచనేని రామబ్రహ్మం, దాత బుచ్చిబాపయ్య చేతుల మీదగా పంపిణీ చేశారు. పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయిని అంబటి ఉషా కుమారికి రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి అక్కినేని రాఘవేంద్రరావు, కోశాధికారి కొల్లేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

జయసూర్య కుటుంబ సభ్యులకు పరామర్శ

పెనమలూరు: ఫిలిప్పీన్స్‌లో మూడు రోజుల క్రితం మృతి చెందిన మెడిసిన్ విద్యార్థి అయోధ్య జయసూర్య కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ పరామర్శించారు. యనమలకుదురులో ఉంటున్న మృతి చెందిన విద్యార్థి తండ్రి డాక్టర్ అయోధ్య సత్యనారాయణ ఇంటికి దేవినేని అవినాష్ బుధవారం వచ్చారు. మెడిసిన్ పూర్తి చేసే సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై జయసూర్య మృతి చెందటం చాలా బాధాకరమని అవినాష్ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత గుమ్మడి విజయ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఉయ్యూరు: కారును ఢీకొని ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలైన సంఘటన జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. ఉయ్యూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారును మండలంలోని చిన ఓగిరాల సమీపంలో జాతీయ రహదారిపై బుల్లెట్ ఢీకొంది. పోరంకికి చెందిన కటికల చంటిబాబు, క్రాంతి, సుహాస్‌లు బుల్లెట్‌పై ఉయ్యూరు నుంచి పోరంకి వెళ్తున్నారు. చిన ఓగిరాల జాతీయ రహదారి వెంబడి పెట్రోల్ బంకు సమీపంలో విజయవాడ వైపు వెళ్తున్న కారును వెనుకగా ఢీకొన్నారు. ఘటనలో ముగ్గురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో విజయవాడ తరలించారు. చంటిబాబుకు తీవ్ర గాయాలు కావటంతో పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న ఉయ్యూరు టౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: మండల పరిధిలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఈదురు గాలులతో వర్షం కురవటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెనమలూరు పరిసర ప్రాంతాల్లో వర్షం బాగా కురవటంతో రోడ్లు జలమయమయ్యాయి. యువగళం సందర్భంగా టీడీపీ నేతలు విద్యుత్ స్తంభాలకు బ్యానర్లు కట్టడంతో అవి గాలికి విద్యుత్ తీగలకు చుట్టుకు పోయాయి. దీని కారణంగా దాదాపు గంటన్నర విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు శ్రమించి బ్యానర్లు తొలగించి విద్యుత్ పునరుద్ధరించారు.

రేపు ఏసీ ఫంక్షన్ హాల్ ప్రారంభం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఏసీ ఫంక్షన్‌హాల్‌గా మార్చిన మొదటి అంతస్తును ఈ నెల 25వ తేదీన ప్రారంభించనున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ బుధవారం తెలిపారు. పలువురు దాతలు స్పందించి ఏసీ హాలు కోసం విరాళాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం 9.30 గంటలకు హాలును ప్రారంభిస్తామన్నారు.